సన్‌డే..!

నిర్మానుష్యమైన రోడ్లు

పాలకొల్లులో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

ప్రజాశక్తి - పాలకొల్లు

సూరీడు ఆదివారం సుర్రుమన్పించాడు. దీంతో పట్టణంలో వాతావరణం కర్ఫ్యూను తలపించింది. ఎండ ప్రభావం తీవ్రంగా ఉండటంతో ఉదయం 10 గంటలు దాటాక రోడ్లపై జనసంచారం లేక వెలవెలబోయాయి. దీంతో వ్యాపారులు సైతం షాపులు కట్టేసి ఇంటికే పరిమితమయ్యారు. వార్డుల్లో రహదారులు కూడా జన సంచారం లేక నిర్మానుష్యంగా ఉన్నాయి. చిరు వ్యాపారులు సైతం ఇంటికే పరిమితమయ్యారు.

పిజిఆర్ఎస్ బూటకం..!

'మండల కేంద్రం నిడమర్రులో సర్వే నెంబర్ 240-5ఎ, 5బిలో 34 సెంట్లు తన పేరున ఆన్‌లైన్‌లో ఉన్న భూమిని మండలాధికారులు అడ్డగోలుగా వేరొకరి పేరున ఆన్‌లైన్ చేసేశారంటూ బాధితుడు జిల్లా కేంద్రంలోని పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదును ఆర్‌డిఒకు అప్పగించి పరిష్కరించాల్సి ఉండగా, మళ్లీ మండల తహాశీల్దార్‌కు పంపారు. ఏ తహాశీల్దార్ అయితే తప్పు చేశారని ఫిర్యాదు చేశారో, అదే అధికారికి ఏవిధంగా పంపిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.'

'ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామంలో సర్వే నెంబర్ 95-1జి1లో ఉన్న 25 సెంట్ల భూమి తన పేరున ఉందని, పాస్‌బుక్ కూడా వచ్చిందని, రీసర్వేలో ఖాతా నెంబర్ తప్పుగా నమోదు చేయడంతో మ్యూటేషన్‌కు దరఖాస్తు చేసినా తీసుకోవడం లేదని బాధితుడు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఏడాదిన్నరపాటు మండల తహాశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మళ్లీ ఆ ఫిర్యాదు తహాశీల్దార్‌కే వెళ్లింది. ఖాతా నెంబర్ తప్పుగా వేయడంతో అది జెసి లాగిన్‌లో మాత్రమే పరిష్కారమవుతుందని తెలిసినా చేయడం లేదు. పిజిఆర్ఎస్ ముగించేసి, వినతి రూపంలో ఇవ్వాలని బాధితునిపై ఒత్తిడి తీసుకొస్తుండటం గమనార్హం'.

పిజిఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి (ఫైల్ ఫోటో)

సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి కరువు

తహాశీల్దార్‌పై ఫిర్యాదు చేస్తే మళ్లీ ఆ అధికారి లాగిన్‌లోకే దరఖాస్తు

ఏ శాఖ మండలాధికారిపై ఫిర్యాదు చేస్తే అదే అధికారికి అప్పగింత

దొంగ చేతికి తాళాలు ఇచ్చిన చందంగా వ్యవహారం

నెలలు తరబడి జాప్యం చేసి పరిష్కరించకుండానే మూసివేత

రీఓపెన్‌పై అవగాహన లేక దిక్కుతోచని స్థితిలో జనం

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో పరిస్థితి మరింత దారుణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన బాధితులే కాదు.. పిజిఆర్ఎస్‌లో జనాలు ఇస్తున్న ఫిర్యాదుల్లో అత్యధికం ఇదే పరిస్థితుల్లో ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్‌లో 200కుపైగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక ఆన్‌లైన్ ఫిర్యాదులూ ఉంటున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపై వస్తున్న ఫిర్యాదుల పరిష్కారం మరింత ఘోరంగా ఉంటుంది. చాలా మండలాల్లో రెవెన్యూ అధికారులు కుమ్మక్కై భూములకు సంబంధించి ఆన్‌లైన్ వ్యవహారాల్లో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. తమ సమస్యలపై మండలంలోని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగితిరిగి వేసారిపోయిన బాధితులు జిల్లా కేంద్రానికి వచ్చి ఉన్నతాధికారులకు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. మండలాధికారి వద్ద సమస్య పరిష్కారం కావడం లేదని బాధితుడు ఫిర్యాదు ఇచ్చినప్పుడు పైఅధికారి లాగిన్‌కు ఫిర్యాదును పంపించాలి. జిల్లా అధికారులు అందుకు విరుద్ధంగా చేస్తున్న పరిస్థితి నెలకొంది. దొంగ చేతికి తాళాలు ఇచ్చిన చందంగా ఏ అధికారి సమస్యను పరిష్కరించకుండా ఇబ్బంది పెట్టారో, అదే అధికారి లాగిన్‌కు పంపిస్తున్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుకు సంబంధించి సమస్యను బట్టి నెలరోజుల నుంచి 90 రోజుల వరకూ గడువు ఉంటుంది. దీంతో నెలలు తరబడి సమస్య పరిష్కారం కాకపోగా, చివరి నిముషంలో ఏదోకటి రాసేసి ఫిర్యాదును ముగించేసినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు. చాలామందికి ఆన్‌లైన్‌లో తిరిగి రీఓపెన్ చేయడంపై అవగాహన లేకపోవడంతో మళ్లీ జిల్లా కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేస్తే మళ్లీ మొదటికి వస్తోంది. దీంతో ప్రజలు ఎన్నో ఆశలతో పిజిఆర్ఎస్‌కు వచ్చి ఇస్తున్న ఫిర్యాదులు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో చిత్తశుద్ధి లేకపోవడమే దీనికి కారణంగా చెప్పొచ్చు. ప్రభుత్వం మాత్రం పిజిఆర్ఎస్‌పై గొప్పలు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. జిల్లా కేంద్రంలో పిజిఆర్ఎస్ ఫిర్యాదుల స్వీకరణ నామకహా అన్నట్లు సాగిపోతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. రెవెన్యూ సమస్యలు కొన్ని ఆర్‌డిఒ, మరికొన్ని జెసి పరిష్కరించాల్సి ఉంటుంది. అటువంటి ఫిర్యాదులు తహాశీల్దార్‌కు వద్దకు వచ్చినా వారు జిల్లా ఉన్నతాధికారులు తెలియపరచకుండా ముగించేస్తున్నారు. ఏదైనా సమస్యపై మండల కేంద్రంలో అధికారుల చుట్టూ తిరిగి న్యాయం జరగకపోవడంతో బాధితులు జిల్లా కేంద్రానికి వస్తున్నారు. ఆ ఫిర్యాదును మళ్లీ మండలాధికారుల వద్దకు పంపించడం వల్ల ఉపయోగం ఏమిటో అధికారులే చెప్పాలి. పరిష్కరించినట్లు చూపుతున్న పిజిఆర్ఎస్ ఫిర్యాదుల్లో చాలా వరకూ బూటకంగా ఉంటున్నాయి. ఉన్నతాధికారుల నుంచి తప్పించుకునేందుకు ఏదోక కారణం రాసి పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు ముగింపు పలికేస్తున్న పరిస్థితి ఉంది.

సమస్యలపై చిత్తశుద్ధితో ఉంటేనే న్యాయం

పిజిఆర్ఎస్‌లో వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం రెవెన్యూకు సంబంధించినవే ఉంటున్నాయి. రెవెన్యూ సమస్యలపై బాధితులు జిల్లాలో జరిగే పిజిఆర్ఎస్‌కు వచ్చినప్పుడు ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. అలాకాకుండా ఏదో నామకహా అన్నట్లు వ్యవహరిస్తే ఏళ్లపాటు తిరిగినా సమస్యలు పరిష్కారానికి నోచుకోని పరిస్థితి ఉంటుంది. పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని జనం కోరుకుంటున్నారు.

ఉపాధి కూలీల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

సిపిఎం ఆధ్వర్యాన మంత్రి రామానాయుడుకు వినతి

మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - పాలకొల్లు

మొగల్తూరులో గత నెల 16న ఉపాధి పనులు చేస్తున్న కూలీలపైకి మినీవ్యాన్ బోల్తా పడిన ఘటనలో మృతి చెందిన ముగ్గురు, గాయపడిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మంత్రి రామానాయుడుకు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాస్ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రమాదంలోకడలి పావని, గుబ్బల గంగాదేవి, గుబ్బల మాణిక్యాలరావు మృతి చెందారని, తీవ్ర గాయాలైన గుడాల సత్యనారాయణను భీమవరం ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స చేయించి, ఇటీవల డిశ్చార్జి అయ్యారని, అయితే ఆయన ప్రస్తుతం ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్నారని వివరించారు. ఘటన జరిగిన వెంటనే వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆందోళన చేపట్టడంతో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు మాత్రమే ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. గుడాల సత్యనారాయణ చికిత్సకు అయిన ఖర్చుల నిమిత్తం రూ.90 వేలు ఉపాధి హామీ ఉద్యోగులు తలోకొంత వేసుకుని ఇచ్చారని తెలిపారు. మాణిక్యాలరావును నర్సాపురం నుండి భీమవరం, అక్కడి నుంచి గుంటూరు తీసుకెళ్లేందుకు అయిన అంబులెన్స్ ఖర్చే రూ.85 వేలని తెలిపారు. దీంతో ఆ పేద కుటుంబం అప్పుల పాలైందని, ఆ సొమ్ము చెల్లించలేదని తెలిపారు. మృతుల కుటుంబాలకు కనీసం రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, క్షతగాత్రులకు రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

పలుచోట్ల కరపత్రాలు ఆవిష్కరణ



తణుకులో సంస్థ ప్రతినిధికి సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెంలోని సిఐటియు పట్టణ కమిటీ సమావేశం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గోడ పత్రికను ఆవిష్కరించారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, సమ్మెను జయప్రదం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ హాజరై మాట్లాడుతూ మన దేశంలో యుద్ధం రాకుండా చర్యలు తీసుకోవడం మంచి పరిణామంగా భావిస్తున్నామని ఆయన అన్నారు. దేశంలో ఉగ్రవాదం ప్రవేశించి అమాయక ప్రజల ప్రాణాలు బలికొంటే దానికి దీటైన సమాధానం ఆపరేషన్ సిందూర్ ద్వారా ఇచ్చారన్నారు. ఇప్పటికైనా ఉగ్రవాదుల్ని అప్పగించే బాధ్యత పాకిస్థాన్‌కు ఉందని, ప్రపంచవ్యాప్తంగా మనదేశం కూడా పాకిస్తాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజలు అనేక కష్టాలతో బాధపడుతున్నారని, మోడీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్లైనా దేశప్రజలకు ఎటువంటి మేలు జరగలేదని వాపోయారు. మోడీ హయాంలో కార్పొరేట్‌లకు దేశ సంపద మొత్తం దోచిపెట్టే విధంగా పాలన ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు బ్యాంకు రుణాలు మాఫీ చేశారని గుర్తుచేశారు. కార్పొరేట్‌లు పన్ను 37 శాతం నుంచి 27 శాతానికి తగ్గించారని, దేశ ప్రజలకు రావాల్సిన ఆదాయం తగ్గుతూ వస్తుందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీలకు, కార్పొరేట్‌లకు కట్టబెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీషు కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా విభజించి కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని వాపోయారు. మనదేశంలో 45 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని, అందులో 9 కోట్ల మందికి అరకొర సదుపాయాలు ఉన్నాయని మిగిలిన 36 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులకు ఎటువంటి చట్టాలు అమలు చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ప్రజానీకం 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెకు సిఐటియుతో పాటు మరో 11 కార్మిక సంఘాలు మద్దతు ఇచ్చాయని తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండ రామిరెడ్డి, చల్లా చంద్రరావు, చిటికిన రాము, గొర్రెల సతీష్ కుమార్, నరమాల కృష్ణ, దేశంశెట్టి సతీష్, పులిమంతుల రమణ పాల్గొన్నారు.

ఆకివీడు : రోజుకు ఎనిమిది గంటల పని సమయాన్ని పెంచి 14 గంటలకు చేయాలంటున్న కార్పొరేట్ శక్తుల వాదనను తిప్పికొట్టాలని సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటినాయుడు చెప్పారు. ఈ వాదనను తిప్పి కొట్టడానికి సమైక్యంగా ఈనెల 20వ తేదీన జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జవహర్ పేట రైస్ మిల్లుల సముదాయం వద్ద రైస్ మిల్లుల కార్మికులు, ట్రేడ్ యూనియన్ లీడర్లు సంయుక్తంగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తవిటి నాయుడు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల కార్మిక కర్షక సాధారణ ప్రజానీకానికి అనుకూలంగా ఉండే చట్టాలు మార్చుకుంటూ పోతుందన్నారు. పాత బానిస విధానాన్ని అమలు చేయాలని రాజ్యాంగాల్లో అంశాలను నష్టపరుస్తోందన్నారు. ఈ రకమైన విధానాలను వ్యతిరేకిస్తూ చట్టాలను కాపాడుకోవడానికి సమయం ఒకటే మార్గమని, ఆ మార్గంలోనే సమ్మె చేపడుతున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు పెంకి అప్పారావు, బొర్రా సత్యం, తమ్మిశెట్టి కృష్ణ, బడుగు సాంబశివరావు, చీకటి త్రినాథరావు, ఎ.నాగరాజు పాల్గొన్నారు.

తణుకు : గ్యాస్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల జరిగే దేశవ్యాప్త సమ్మెలో గ్యాస్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక గ్యాస్ కార్మికుల సమావేశంలో పాల్గొన్న ప్రతాప్ మాట్లాడుతూ గ్యాస్ కార్మికుల పనిగంటలు ఎక్కువ, సౌకర్యాలు తక్కువ అని అన్నారు. తణుకు పట్టణంలో ఎన్నో గ్యాస్ కంపెనీలు ఉన్నా కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. అన్ని కంపెనీల్లో కార్మికులకు గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని గ్యాస్ కంపెనీల్లో అసలు జీతం లేకుండా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతీ ఆదివారం, పండగల్లో శెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంస్థ ప్రతినిధికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పద్మారావు, కార్యదర్శి ముత్యాలరావు, పాపారావు, శ్రీనివాస్, దుర్గారావు, సోమయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

'ఉగ్రవాదాన్ని తుద ముట్టించడమే మన లక్ష్యం'



భీమవరం టౌన్ :శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పాకిస్తాన్ వంకర బుద్ధిని తరిమికొట్టాలని, ఉగ్రవాదాన్ని తుద ముట్టించడమే మన లక్ష్యమని యూత్ హాస్టల్స్ సభ్యులు నందమూరి రాజేష్, ఆటో యూనియన్ ఓనర్స్ అండ్ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు యింటి సత్యనారాయణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం వెంకట్రామ థియేటర్ వద్ద ఆదివారం జయహో భారత్ అంటూ నినాదాలు చేస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెహల్గాం దాడిలో 22 మంది పర్యాటకులను విచక్షణారహితంగా కాల్చి చంపిన వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించకూడదన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ప్రజానాట్య మండలి సభ్యులు ఎస్‌కె.చాన్‌భాషా, మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షులు చల్లా రాము, కొప్పినీడి బాబీ, కోయ రాంబాబు మాట్లాడుతూ ఒప్పందం తర్వాత కూడా పాకిస్తాన్ వంకర బుద్ధితో మళ్లీ కాల్పులు జరపడం సిగ్గుచేటని, ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను అంతమొందించాలని అన్నారు. యావత్ ప్రపంచం భారత సైన్యానికి పూర్తి మద్దతు తెలియజేస్తుందన్నారు. భారత సైన్యానికి మనోధైర్యం కల్పించడానికి శాంతియుత ర్యాలీలు చేపడుతున్నామని తెలిపారు.

ఆకివీడు : యుద్ధంలో దేశం కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్లకు నివాళులర్పిస్తూ స్థానిక సమతా నగర్ ప్రాంత ప్రజలు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలని, అమర జవాన్లకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేస్తున్న పోరుకు అందరూ మద్దతుగా నిలవాలని, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ వైఖరిని అందరూ ఖండించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో బైరి ఆంజనేయులు, దొడ్డి జగదీష్, ఓగిరాల ఏలియా, డి.కళ్యాణి, నరేష్ రాజు, వాసింశెట్టి శివ, కొయ్యే శ్రీను, భూపతి నాని, విక్రమ్ మాస్టారు, రాంబాబు మాస్టారు పాల్గొన్నారు.

ఆకివీడులో కొవ్వొత్తుల ర్యాలీ

డిసిఎంఎస్ చైర్మన్‌గా చాగంటి మురళీకృష్ణ

నరసాపురానికి మరో పదవి

పవన్‌కళ్యాణ్‌కు బొకే అందిస్తున్న చాగంటి మురళీకృష్ణ

ప్రజాశక్తి - నరసాపురం

డిసిఎంఎస్ ఛైర్మన్‌గా జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా) నియమితులయ్యారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన యువ వ్యాపారవేత్త చాగంటి మురళీకృష్ణ (చిన్నా) జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి 2014లో పార్టీలో చేరారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీని ముందుకు నడిపారు. తన వ్యాపారాలు సైతం పక్కన పెట్టి జనసేన బలోపేతానికి నిర్విరామంగా కృషి చేశారు. 2019 సాధారణ ఎన్నికల్లో నర్సాపురం నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ సుమారు 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందడంలో మురళీకృష్ణ కీలకపాత్ర పోషించారు. కాపు సామాజిక తరగతిలో మంచి పట్టున్న నాయకుడు చిన్నా. పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో తనదైన శైలిలో పనిచేసి జనసేన అభ్యర్థుల విజయానికి చిన్నా కృషి చేశారు. దీంతో జనసేన రాష్ట్ర కార్యదర్శి పదవిని అధిష్టానం కట్టబెట్టింది. చిన్నా సోదరుడు చాగంటి పార్థసారథి లక్ష్మణేశ్వరం గ్రామ సర్పంచిగా పని చేశారు. తన తండ్రి చాగంటి ఉమానాయుడు ఆశయ సాధన కోసం చాగంటి ఉమానాయుడు ట్రస్టు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వారికి సాయం చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డొక్కా సీతమ్మ మొబైల్ క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల ఆకలిని తీర్చారు. ప్రస్తుతం ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం డిసిఎంఎస్ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చిన్నా డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నాను ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్‌ఎలు బండారు మాధవనాయుడు, కొత్తపల్లి జానకీరామ్, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొవ్వలి నాయుడుతోపాటు కూటమి నేతలు అభినందించారు. డిసిఎంఎస్ ఛైర్మన్‌గా చిన్నా నియామక వార్త తెలియగానే చాగంటి చిన్నా కార్యాలయం, ఇంటి వద్ద జనసేన కార్యకర్తలు, నాయకులు స్వీట్లు పంచి, కేకులు కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు.

ఆప్కాబ్, డిసిసిబి ఛైర్మన్‌గా గన్ని



గన్ని వీరాంజనేయులును అభినందిస్తున్న ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఉంగుటూరు మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు జాక్‌పాట్ కొట్టారు. ఆప్కాబ్ ఛైర్మన్‌గా, డిసిసిబి ఛైర్మన్‌గానూ గన్నిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా ఉంగుటూరు సీటును త్యాగం చేసిన గన్ని సేవలను అధిష్ఠానం గుర్తించి సముచిత స్థానం కల్పించడంతో ఆ పార్టీ అభిమానులు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. భీమడోలులోని టిడిపి కార్యాలయంలో గన్నిని కలిసి అభినందించేందుకు నాయకులు, కార్యకర్తలు క్యూ కట్టడంతో కోలాహలంగా మారింది. 2014 ఎన్నికల్లో టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం 2019 ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే 2024 ఎన్నికల్లో జనసేనకు సీటు త్యాగం చేయాల్సి వచ్చింది. దీనిపై తొలుత కొంత అసంతృప్తి వ్యక్తం చేసినా తర్వాత గన్ని రంగంలోకి దిగి జనసేన అభ్యర్థి, ప్రస్తుత ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు గెలుపు కోసం కృషి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా గన్నికి ఎలాంటి పదవి రాకపోవడంతో ఆయన అనుచరులు నిరాశకు గురయ్యారు. ఈ తరుణంలో రాష్ట్ర, జిల్లాస్థాయి పదవులు ఆప్కాబ్, డిసిసిబి ఛైర్మన్ బాధ్యతలు గన్నికి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు భీమడోలు వెళ్లి గన్నిని అభినందించారు. గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడుకు చెందిన ముత్యాల రత్నంకు ఆప్కాబ్ ఛైర్మన్ పదవి దక్కింది. ఈసారి ఆ పదవి గన్నిని వరించింది.

వైసిపి పాలనలో రైతులకు మొండిచెయ్యి

మంత్రి నిమ్మల రామానాయుడు

మంత్రి రామానాయుడికి ధాన్యం బస్తాను అందిస్తున్న రైతులు

ప్రజాశక్తి - యలమంచిలి

వైసిపి ఐదేళ్ల పాలనలో రైతాంగానికి జరిగిన మేలు సున్నా అని, అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసి మొండిచెయ్యి చూపారని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మన రైతు.. మన రామానాయుడు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కొంతేరు, కాజ వెస్ట్, వరిధనం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు, మహిళలు, గ్రామస్తులు మంత్రి రామానాయుడుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో ప్రతిరోజూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నామన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో సమస్యలు పేరుకుపోయాయని, పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని తెలిపారు. పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం నిధులను మళ్లించి చిల్లిగవ్వ కూడా లేకుండా చేశారన్నారు. కనీసం ఇంటింటి చెత్తసేకరణ కార్మికులకు వేతనాలు చెల్లించడంగాని, సురక్షిత తాగునీరు అందించేందుకు ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులకు, ఇసుక మార్పిడికి రూపాయి లేకుండా చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పంచాయతీలకు నేరుగా ఆర్థిక సంఘం నిధులు వచ్చేలా చేయడంతోపాటు సర్పంచులకు గౌరవ వేతనాలను అందిస్తుందన్నారు. నాడు వైసిపి ఐదేళ్ల విధ్వంస పాలన నుంచి నేడు అభివృద్ధి వైపు కూటమి ప్రభుత్వ పాలన నడుస్తుందని మంత్రి రామానాయుడు తెలిపారు.

మంత్రికి ధాన్యం బస్తా ఇచ్చిన రైతులు

కొంతేరు గ్రామంలో చీమలపాడు రైతులు దాళ్వా సాగుకు నీటి ఇబ్బందులు లేకుండా సమృద్ధిగా నీరందించడం వల్ల పంట దిగుబడులు పెరిగాయని, అందుకు మంత్రి రామానాయుడుకు కృతజ్ఞత తెలిపి ధాన్యం బస్తాను అందజేశారు. ఆయన వెంటనే అక్కడ ఉన్న వ్యవసాయ కూలీకి ఆ బస్తా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, బొప్పన హరికిషోర్, ఆరిమిల్లి చిన్ని, కోడి విజయభాస్కర్, పాముల రజనీకుమార్, ఉన్నమట్ల కపర్థి, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, యర్రంశెట్టి పద్మారావు, మాత రత్నంరాజు, కడలి గోపాలరావు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ హెచ్చరిక



అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని మాజీమంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అధికారులను హెచ్చరించారు. ఆదివారం మార్టేరు, నెగ్గిపూడి శివారు నరసాపురం-పెరవలి రహదారిపై నిర్మిస్తున్న కల్వర్టు పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రూ.59 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కల్వర్టు పనుల్లో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పెనుగొండ పెద్ద వంతెన వద్ద బ్రిడ్జి నిర్మాణ పనుల్లోనూ కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఎంఎల్‌ఎ వెంట ఆర్‌అండ్‌బి డిఇ జి.వరలక్ష్మి, జెఇ ప్రసాద్, ఎఇ యశ్వంత్, టిడిపి నేతలు తవనంపూడి శ్రీనివాస్‌రెడ్డి (బుల్ల), చిర్ల బాలాజీరెడ్డి, కోనాల శ్రీనివాసరెడ్డి, వెలగల మల్లికార్జునరెడ్డి, కర్రి అచ్యుత రామారెడ్డి, కడలి వెంకటేశ్వరరావు, బొక్కా వెంకట రమణ, శ్రీనివాస్, తేతలి రాజారెడ్డి, సోమసుందర్‌రెడ్డి, కీర్తి చైతన్య, కారేపల్లి భాస్కరరావు, షేక్ మహ్మద్ ఆలీ, కట్టా బాలాజీ వన కుమార్ పాల్గొన్నారు.

సాగర తీరం.. కోలాహలం

స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కి ఉదయమే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. బీచ్ వద్దనున్న ఆలయాలను దర్శించుకుని సరివి కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.

అసాంఘిక కార్యకలాపాల అడ్డాగా ఇరిగేషన్ కార్యాలయం

పట్టించుకోని అధికారులు

ఇరిగేషన్ కార్యాలయం

ప్రజాశక్తి - గణపవరం

మండలకేంద్రంలోని మసీదు వీధిలో ఉన్న ఇరిగేషన్ కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఈ కార్యాలయంలో రాత్రుల్లు ఆకతాయిలు మద్యం సేవించటం, జూదం ఆడటం వంటివి చేస్తున్నా అధికారులు పట్టించుకోవటంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ కార్యాలయానికి ఇన్‌ఛార్జి అధికారులు తప్ప పూర్తిస్థాయిలో అధికారులు లేకపోవటంతో కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి సమయంలో మహిళలు ఇంటి బయటకు వస్తే మద్యం మత్తులో ఉన్న ఆకతాయిలు ఈలలు వేసి అల్లరి చేస్తున్నారని, ఈవిషయంపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేయడానికి మహిళలు సిద్ధం అవుతున్నారు. వెంటనే ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని, ఇరిగేషన్ కార్యాలయంలో ఎటువంటి కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, లేకపోతే మండలాధికారులకు ఫిర్యాదు చేస్తామని మహిళలు తెలిపారు.

మాజీమంత్రి రజినిపై పోలీసుల తీరు అమానుషం

ఆచంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్

ప్రజాశక్తి - ఆచంట

మాజీ మంత్రి, బిసి మహిళా నేత విడదల రజినిపై చిలకలూరిపేట సిఐ సుబ్బనాయుడు వ్యవహరించిన తీరు అమానుషమని ఆచంట మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్ అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చిలకలూరిపేటకు చెందిన వైసిపి నేతను అరెస్ట్ చేయడంపై విడదల రజిని సిఐ సుబ్బ నాయుడుని ప్రశ్నించడంతో సరైన సమాధానం చెప్పకుండా, ఒక మహిళా మాజీ మంత్రి అని చూడకుండా ముందు నుంచి దిగు లేదా నీమీద కూడా కేసు పెడతానని సిఐ బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైసిపి శ్రేణులపై దాడులకు తెగబడుతుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. సాక్షాత్తు మాజీ మంత్రిపైనే ఇటువంటి దాడులకు తెగబడితే రాష్ట్రం ఎటువైపు వెళ్తుందో ఆలోచించుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ సంవత్సర కాలంలో ఇచ్చిన హామీలు ఏమి నెరవేర్చారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. మహిళలతో పెట్టుకున్న ఏ రాజకీయ పార్టీ మనుగడలో లేదని హెచ్చరించారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

వైసిపి నుంచి టిడిపి గూటికి..

ప్రజాశక్తి - కాళ్ల

బొండాడ గ్రామం నుంచి వైసిపి నాయకులు టిడిపిలోకి చేరడం మంచి శుభపరిణామని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పెదఅమిరంలో ఎపి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు కార్యాలయంలో ఆదివారం వైసిపి సీనియర్ నాయకుడు, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు మన్నే నాగరాజుతో పాటు బొండాడ గ్రామ సర్పంచి మన్నే వరలక్ష్మి, వైస్ ఎంపిపి మన్నే నాగలక్ష్మి శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ మందపాటి రాము, గ్రామధ్యక్షుడు మందపాటి రవి, పంచాయతీ బోర్డు సభ్యులతో పాటు సుమారు 150 మంది వైసిపి నాయకులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ భీమవరం పట్టణానికి సమీపంలో ఉన్న బొండాడ గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. సరైన సమయంలో టిడిపిలోకి చేరి గ్రామాభివృద్ధికి కృషిచేసేందుకు వచ్చిన నాయకులను అభినందించారు. రానున్న రోజుల్లో ఉండి నియోజకవర్గంలో వైసిపి ఖాళీ అవుతుందన్నారు. వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు మన్నే నాగరాజు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సమక్షంలో ఆదివారం టిడిపిలో చేరారు. తొలుత బొండాడ గ్రామం నుంచి ర్యాలీగా పెదఅమిరం గ్రామం వరకు డిప్యూటీ స్పీకర్ కార్యాలయానికి చేరుకుని పార్టీలో చేరారు. ఆయనతో పాటు గ్రామ సర్పంచి మన్నే వరలక్ష్మి, వైస్ ఎంపిపి మన్నే నాగలక్ష్మి, గ్రామాధ్యక్షుడు మందపాటి రవి, దేవస్థానం ఛైర్మన్ రాముతో పాటు 150 మంది టిడిపి కండువా కప్పుకున్నారు.

160 గ్రాముల వెండి అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం మెంటేవారితోటలోని శ్రీవిజయకనకదుర్గ శ్రీచక్ర సహిత బాలత్రిపుర సుందరి అమ్మవారి వెండి పీఠానికి దాతలు 160 గ్రాముల వెండిని విరాళంగా అందించారు. ఆదివారం భీమవరంకు చెందిన నార్నిరాజా బులిస్వామి, వనజ దంపతులు 110 గ్రాముల వెండి, నార్ని రామకృష్ణ దంపతులు, నార్ని శ్రీనివాస్ దంపతులు 50 గ్రాముల వెండి మొత్తం 160 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం యాత్రికులతో కలకలలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మోక అరుణ్‌కుమార్, చైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

టిడిపి గ్రామ కమిటీలు ఖరారు

పెనుమంట్ర : మండలంలోని 18 గ్రామాలకు గాను 13 గ్రామాల్లో టిడిపి గ్రామకమిటీలకు అధ్యక్ష కార్యదర్శుల నియామకం జరిగిందని టిడిపి మండల అధ్యక్షులు టి.శ్రీనివాస రెడ్డి (బుల్లా) ఆదివారం ఇక్కడ తెలిపారు. ఈ ఎంపిక గురించి మాజీమంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ సమక్షంలో ఖరారు చేశామని అన్నారు. ఈమేరకు మార్టేరు గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా కోనాల శ్రీనివాస రెడ్డి, మజ్జి అచ్యుత రావు, నెగ్గిపూడి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా చిర్ల బాలాజీ రెడ్డి, కట్టా వెంకట రమణ, సత్యవరం గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా దొంగ సూర్య ప్రకాష్, యల్లమిల్లి సూరిబాబు, కొయ్యేటిపాడు గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా కర్రి ఈశ్వర వెంకటరెడ్డి, కేతా మీరయ్య, ఆలమూరు గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా కర్రి అయ్యప్ప రెడ్డి, గురివి పరమేశ్వరరావు, ఓడూరు గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా యిందుకూరి వెంకట నరసింహరాజు, బాలం దుర్గారావు, సోమరాజు ఇల్లింద్రపర్రు గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా గుబ్బల వెంకట సత్యనారాయణ, వెలగల రామచంద్రా రెడ్డి, మల్లిపూడి గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, కడలి సత్తిబాబు, జుత్తిగ గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా గొలుగూరి వెంకట సూర్యనారాయణరెడ్డి, గుత్తుల శ్రీను, వెలగలవారి పాలెం గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా కర్రి బులి రామిరెడ్డి, రాళ్లపల్లి సత్యనారాయణ, గరువు గ్రామ అధ్యక్ష కార్యదర్శులుగా సత్తి సత్యానంద రెడ్డి, చిటికెన సాంబశివరావు, పొలమూరు గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా పి.వి.రాఘవేంద్ర రాజు, మేడిశెట్టి నాగేశ్వరరావు, పెనుమంట్ర గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా ఘంటా వెంకట శ్రీనివాసరావు(వాసు), కొప్పిశెట్టి సూర్యనారాయణ నియామకం అయ్యారు.

19 నుంచి దేశాలమ్మ జాతర మహోత్సవాలు

పాలకొల్లు : పాలకొల్లు లాక్ దిగువ వేంచేసియున్న శ్రీదేశాలమ్మ అమ్మవారి 53వ జాతర మహోత్సవాలు ఈనెల 19 నుంచి 25 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ సోమవారం రాత్రి జాతర ప్రారంభమవుతుందని, ముఖ్యఅతిథిగా మంత్రి నిమ్మల రామానాయుడు దంపతులు పాల్గొంటారని తెలిపారు. జాతర సందర్భంగా ఒకే సమయంలో రాత్రి 9 గంటలకు ఆరు ప్రోగ్రాములు నిర్వహించబడునని అన్నారు. 20వ తేదీ మంగళవారం అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీ శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నవకాయ పిండి వంటలతో సహపంక్తి భోజనములు నిర్వహిస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సామాన్యులకు అందుబాటులో నాణ్యమైన విద్యాబోధన

విద్యార్థి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ పడాల వెంకటరెడ్డి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సామాన్యులకు నాణ్యమైన ఐబిటి విద్యతోపాటు, కంప్యూటర్ కోడింగ్, రోబోటిక్ పరిజ్ఞానం అందుబాటులోకి తెస్తూ జిల్లాలోనే అగ్రగామి విద్యాసంస్థగా అందరి మన్ననలను పొందుతూ సాగుతున్నామని మండలంలోని వెలగలేరు(మార్టేరు) విద్యార్థి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ పడాల వెంకటరెడ్డి అన్నారు. మార్టేరు, వెలగలేరు, నెగ్గిపూడి, సత్యవరం, వనంపల్లి పరిసర గ్రామ ప్రాంతాలకు చెందిన సామాన్యులకు సైతం ఉన్నత చదువులను చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో 2025-2026 విద్యా సంవత్సరం నుంచి ముంబై ఎక్స్‌పర్ట్స్ ఐబిటి విద్యతో పాటు, కంప్యూటర్ కోడింగ్, రోబోటిక్ పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకొస్తున్నామని అన్నారు. మండలంలోని మార్టేరు పంచగ్రామాల్లో ఒకటైన వెలగలేరు గ్రామంలో 2009-10 విద్యాసంవత్సరం ఎల్‌కెజి నుంచి 10వ తరగతి వరకు లీడ్ ఇంటర్నేషనల్ కరిక్యులం ద్వారా విద్యను అందించేలా తరగతులు ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలకు నాణ్యమైన విద్యను కార్పొరేట్ స్థాయిని మించి అందిస్తున్నామన్నారు. విద్యార్థులు బట్టీపట్టే విధానంతో మార్కుల వెంట పరుగులు తీయకుండా సృజనాత్మక నైపుణ్యాలను పెంచుకుంటూ.. మారుతున్న టెక్నాలజీని సొంతం చేసుకుంటూ అభివృద్ధి పథం వైపు నడిపించడం తమ విద్యార్థి స్కూల్ లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలియజేశారు. దూర ప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం కలదని, క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్, ఇన్‌ఛార్జి, అకడమిక్ కోఆర్డినేటర్ పర్యవేక్షణలో చక్కటి వాతావరణంలో, విశాలమైన సొంత భవనాలలో ఒత్తిడిలేని, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని వారు వెల్లడించారు.

హెచ్ఎం జి.లక్ష్మీ నాగేశ్వరి

కరస్పాండెంట్ పడాల వెంకటరెడ్డి, ప్రిన్సిపల్ సుధారాణి దంపతులు


విద్యార్థి ఇంగ్లీష్ మీడియం స్కూల్

ప్రతిసంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా 10వ తరగతి ఫలితాలలో అద్భుత విజయం సాధించినట్లు తెలియజేశారు. తమ పాఠశాల నుంచి 2022వ సంవత్సరంలో వెల్లడయిన వినీత(556), 2023లో ఇళ్ల ఆశిత(578), 2024లో పెనల లక్ష్మీ నాగసహస్ర(582) మార్కులతో మండల ద్వితీయ, టౌన్ ప్రథమ స్థానం సాధించి అగ్ర భాగంలో నిలిచారని వెంకట రెడ్డి పేర్కొన్నారు. ఈ 2025-26 విద్యా సంవత్సరంలో ద్వారా పూడి లక్ష్మీ నవీన(569), బాలం యశస్విని(550), బి.సత్య సాహితి(534) మార్కులు సాధించగా, పరీక్షలు రాసిన 28 మంది పాసై 100 శాతం ఫలితాలు తెచ్చారని వెల్లడించారు. ఈ స్కూల్ ప్రిన్సిపల్‌గా పడాల సుధారాణి, హెచ్ఎంగా జి.లక్ష్మీ నాగేశ్వరి సమర్ధవంతంగా సేవలు అందిస్తున్నారని ఆయన ప్రశంసించారు.

మా పాఠశాల విద్యార్థులందరూ మంచి మార్కులు తెచ్చుకోవాలని మేము కృషిచేసి మంచి ఫలితాలు సాధించామని, ఈ విజయానికి కారణమైన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కరస్పాండెంట్, ప్రిన్సిపల్ దంపతులు పడాల వెంకటరెడ్డి, సుధారాణి అభినందనలు తెలిపారు.

ఘనంగా మాతృ దినోత్సవం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సృష్టిలో తల్లి ప్రేమ ఎంతో గొప్పదని, అమృతం ఉందో లేదో అది ఆయువు పోస్తుందో లేదో తెలియదు కానీ 'అమ్మ' మాత్రం తన ఆయుష్షును సైతం మనకే పోస్తుందని కాళ్ల మండల వ్యవసాయ శాఖ అధికారిణి చామర్తి వాసుకి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం మాతృదినోత్సవాన్ని భీమవరం పట్టణంలోని రామలక్ష్మణ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 91 ఏళ్ల వయసు కలిగిన కలిగొట్ల కామేశ్వరమ్మకు పాదపూజ చేసి సత్కరించారు. వాసుకి మాట్లాడుతూ జీవితాంతం పిల్లలే తన సర్వస్వంగా భావించే అమ్మ ప్రేమను మించిన ప్రేమ ప్రపంచంలో మరొకటి లేదని అన్నారు. జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కె.సత్యనారాయణ రాజు, నిర్వాహకులు కొనకువాడ రంగసాయి మాట్లాడుతూ నవమాసాలు మోసి, కని పెంచి మనల్ని ప్రయోజకుల్ని చేసిన అమ్మ ముఖంలో సంతోషం ఉండేలా చూసుకుంటే కొంతైనా అమ్మ రుణం తీరుతుందన్నారు. సర్వస్వాన్నీ బిడ్డల కోసం అర్పించే తల్లిని మించిన దైవం మరొకటి లేదన్నారు. అనంతరం కామేశ్వరమ్మను సత్కరించారు. కార్యక్రమంలో సుబ్బరాజు, అరసవల్లి సుబ్రమణ్యం, లైబ్రేరియన్ కె.శిరీష, భీమాల శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన కమిటీ ట్రస్ట్ నూతన కార్యవర్గం సభ్యులను వీరమ్మ పార్క్ సమీపంలోని అంబేద్కర్ భవనంలో ఆదివారం ఎన్నుకున్నారు. ట్రస్ట్ ఫౌండర్‌గా కేసిరాజు, గౌరవాధ్యక్షులు కోనా జోసెఫ్, డాక్టర్ గూడపాటి శాంతరావు, అధ్యక్షులు ముద్వల ఎస్తేర్ రాణి, కార్యదర్శి గంటా సుందర్‌కుమార్, ఉపాధ్యక్షులు ఈది రవి, చిగురుపాటి సందీప్‌లను ఎన్నుకున్నారు. వీరితోపాటు ట్రస్ట్ సహాయ కార్యదర్శి పిల్లి ముసలయ్య, ట్రెజరర్ కందికట్ల వినయ్ దేవ్, సలహాదారులు కందికట్ల జోషి, పిల్లా డైమండ్ రాజు, ఎద్దు ఏసుపాదం, జంగం మాణిక్యాలరావు, పాలపర్తి ప్రియదర్శిని, లీగల్ ఎడ్వయిజర్ టిఇ ప్రశాంత్, సభ్యులు మతా సురేష్ బాబు, గొల్ల రాజ్‌కుమార్, ఆలమూరి బాబ్జీ, యాళ్ల వెంకటేశ్వరరావు, గెడ్డం జార్జ్‌లను ఎన్నుకున్నారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామని, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని అధ్యక్ష కార్యదర్శులు అన్నారు. భవన కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జుత్తిగ నాగరాజు

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

ఎఎంసి ఛైర్మన్ జుత్తిగ నాగరాజు

ప్రజాశక్తి - ఉండి

వైద్యం నేడు చాలా ఖరీదైందని ఉండి లయన్స్ క్లబ్, బిగ్ టివి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉండి నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి, ఎఎంసి చైర్మన్ జుత్తిగ నాగరాజు అన్నారు. మండల కేంద్రం ఉండిలోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం గౌతమి నర్సింగ్ హోం సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించిన గౌతమీ నర్సింగ్ హోం యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ క్యాంపులో డాక్టర్ గోపినాథ్, డాక్టర్ నిరుపమ, డాక్టర్ పవన్ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ సత్తి బ్రహ్మారెడ్డి, డిసి వైస్ చైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, బిగ్ టివి రిపోర్టర్ చిట్టూరి జోషి, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గాధిరాజు రంగరాజు, రుద్రరాజు నరసరాజు, బుద్ధరాజు సుబ్బరాజు, కన్నెగంటి రూత్ కళ పాల్గొన్నారు. ఈ క్యాంప్‌లో వైద్య సేవలు పొందిన వారికి అవసరమైన వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

చట్టప్రకారం కొనుగోలు చేశాం

కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన గన్నాబత్తుల పెద్దిరాజు, పుల్లారావు

ప్రజాశక్తి - మొగల్తూరు

దస్త్రాలను చూపిస్తున్న బాధితులు

తాము ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసిన దస్త్రాలను పంచాయతీ కార్యదర్శి పరిశీలించి ఇంటి పన్ను విధించారని కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన గన్నాబత్తుల పెద్దిరాజు, పుల్లారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు అక్రమార్గంలో మా ఇంటిని కాజేసేందుకు దౌర్జన్యంగా కూల్చివేశారన్నారు. ఆ ఇంటికి మా పేరున విధించిన పన్ను చట్టవ్యతిరేకంగా విధించారని తణుకుల నాగేశ్వరరావు, ఆయన మద్దతుదారులు దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వర్ధనపు ప్రతిభను ప్రజాశక్తి వివరణ కోరగా ఆ ఇంటికి సంబంధించిన అన్ని పత్రాలు పరిశీలించి పన్ను విధించామని తెలిపారు.

'సంప్రదాయాలను కాపాడుకోవాలి'

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పూర్వీకుల నుంచి వస్తున్న మన సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, భీమవరం ఎఎంసి మాజీ చైర్మన్ వాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం భీమవరం మండలం గుట్లపాడు గ్రామంలో పరమ్మ మారెమ్మ జాతర మహోత్సవాలకి హాజరయ్యారు. అలాగే పట్టణంలోని 18వ వార్డులో ఉన్న రెల్లి కులస్తుల కాలనీలో మావుళ్లమ్మ జాతర మహోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి మధు, నాగిడి తాతాజీ, జల్లా బుజ్జి, గంటా త్రిమూర్తులు, ఎలమంచిలి శ్రీను, భీమవరపు పెద్దిరాజు, రెడ్డి సత్తిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవిలో చిన్నారులు జాగ్రత్తలు పాటించాలి

మదర్‌నెస్ హాస్పిటల్లో లిటిల్ వెల్ నెస్ క్యాంప్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వేసవిలో పిల్లలు ఎక్కువగా ఎండలో ఉండడం వల్ల నీరసంగా ఉంటారని, పిల్లల ఆరోగ్యానికి కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరమని మదర్ నెస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్, శిశువు, చిన్నపిల్లల వ్యాధుల సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ వి.వంశీ శివరామరాజు అన్నారు. ఆదివారం భీమవరం జెపి రోడ్డులోని మధర్‌నెస్ ఫెర్టిలిటి ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్లో ఆదివారం చిన్నారుల కోసం లిటిల్ వెల్‌నెస్ క్యాంప్‌ను నిర్వహించారు. డాక్టర్ వంశి మాట్లాడుతూ వేసవి వేడి పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపుతుందన్నారు. అలాంటి వేళ తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. వేసవిలో పిల్లలకు డీహైడ్రేషన్, హీట్ స్ట్రోక్, చర్మవ్యాధులు వస్తాయని, వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటించడం, పాలు, పండ్ల రసాలు, ద్రవపదార్థాలు ఇవ్వడం అవసరమని అన్నారు. శిశువులు, చిన్నపిల్లలకు వేడిగాలులు తగలగుండా తగు జాగ్రత్తలు పాటించాలని, వేడి వాతావరణంలో అనారోగ్య శిశువులు, పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. అనంతరం చిన్నారులకు ప్రాథమిక ఆరోగ్య చెకప్, పోషణ, ఎత్తు, బరువు, సంపూర్ణ ఆరోగ్య తదితర పరీక్షలను నిర్వహించారు. ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీ చైతన్య వర్మ, డాక్టర్ కలిదిండి మానస శ్రవ్య, డాక్టర్ ఎ.గోకుల్ నాథ్, డాక్టర్ పి.సందీప్, చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లిటిల్ వెల్‌నెస్ క్యాంప్‌లో చిన్నారులు, డాక్టర్స్

ఘనంగా సత్యసాయిబాబా సేవాసమితి శత జయంతి

ప్రజాశక్తి - తణుకు

తొమ్మిది నెలలపాటు తల్లి గర్భంలో ఉండి అమ్మ సాన్నిహిత్యాన్ని పొందుకునే మధురానుభూతి ప్రపంచంలో ప్రతీ ఒక్కరికీ ఉంటుందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి వేడుకల సందర్భంగా జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆవరణలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానం ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి బిడ్డ స్థానం నుంచి ప్రయోజకుడిగా మారారంటే తల్లి ప్రేమకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. అందరినీ ప్రేమించు.. సమాజానికి నిరంతరం సేవలు అందించాలని సత్యసాయిబాబా చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఆసుపత్రిలో రోగులతో పాటు సహాయకులకు ఉచితంగా అన్నదానం చేయడానికి 2017లో సత్యసేవా సమితి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరంతరాయంగా దాదాపు 2 లక్షల మందికి అన్నదానం జరుగుతోందని చెప్పారు. సత్యసాయిబాబా ఆలోచనలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ దాతలు సైతం ముందుకు రావడం గర్వించదగిన విషయమన్నారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల సైతం తణుకును స్ఫూర్తిగా తీసుకుని అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రపంచంలో దాదాపు 150 దేశాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఏకైక సంస్థ సత్యసాయిబాబా సేవా సంస్థ అన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తూ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. రాయలసీమలో లక్షలాది మందికి తాగునీరు అందించి సత్యసాయిబాబా తన సేవా కార్యక్రమాలను విస్తృతం చేశారని గుర్తుచేశారు. అనంతరం మహిళలకు కుట్టుమిషన్లు, ఆసుపత్రికి వీల్ చైర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

మరువరానివి బాల్య స్మృతులు

జెడ్‌పి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఉండి

బాల్య స్మృతులు మరువరానివని 2003-04 బ్యాచ్‌కు చెందిన పలువురు విద్యార్థులు అన్నారు. మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి గత స్మృతులను, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరునొకరు ఆలింగనం చేసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ స్థితిగతులను ఒకరితోనొకరు పంచుకున్నారు. పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా ఉత్సాహంగా, ఉల్లాసంగా స్కూలు గ్రౌండ్‌లో కాలం గడిపారు. తమ తరగతి గదులను మరొకసారి గుర్తు చేసుకున్నారు. అప్పట్లో వారు చేసిన అల్లరి చేష్టలను ఒకరితోనొకరు పంచుకుని గుర్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో భారీ కేక్‌ని కట్ చేసి అందరికీ అందించారు. పదో తరగతి పాసై 21 సంవత్సరాలు గడవడంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని విద్యార్థులంతా ఇలా కలుసుకోవడం వల్ల స్నేహాలు బలపడతాయని తెలిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులంతా కలిసి మెమొంటోలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆనాటి ఉపాధ్యాయులు పలువురు మాట్లాడుతూ తాము విద్యాబుద్ధులు నేర్పిన చిన్నారులు తమను గుర్తించుకుని ఈ కార్యక్రమానికి ఆహ్వానించి సత్కరించడం మరపురానిదని అన్నారు. ఈ కార్యక్రమంలో 2003-04 బ్యాచ్ విద్యార్థులు బీడెల్లి రవిరాజు, శ్రీనివాస్, బాసా శేషు కుమార్, వాసు, హేమంత్ పాల్గొన్నారు.

2023-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

గ్రంథాలయాల్లో కొనసాగిన విజ్ఞాన తరగతులు

నరసాపురం : పిల్లలతో గ్రంథాలయ నిర్వాహకులు, రిసోర్స్‌పర్సన్స్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా ఆదివారం పిల్లలకు కథలు వినిపించడం జరిగింది. పిల్లల చేత కథలు, మదర్ థెరిస్సా జీవిత చరిత్ర చదివించారు. రిసోర్స్ పర్సన్ సిహెచ్.శ్రీనివాస్ పాల్గొని పిల్లలకు చిత్రలేఖనంలో శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇచ్చారు. గెల్లి శ్రీనివాస్ యోగ క్లాసులలో శిక్షణ ఇచ్చారు. తదనంతరం సమ్మర్ క్లాసెస్‌లో నేర్చుకున్న అంశాలపై రిసోర్స్ పర్సన్, శాస్త్రవేత్త సుబ్బారావు వారంతపు పరీక్ష నిర్వహించారు. తదుపరి మాతృదినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాతృమూర్తులు రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి తల్లులు గురించి పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ అమ్మ అ అంటే అనురాగం, మ అంటే మమకారానికి ప్రతీక అమ్మ అన్నారు. అటువంటి అమ్మ కడుపులో నుండే మనము వచ్చామని, నవ మాసాలు మోసి, కని, పెంచి మనలను ఉన్నత స్థితిలో ఉంచడానికి శాయ శక్తుల కృషిచేస్తుందన్నారు. ఆత్మ విశ్వాసానికి ప్రతీక అమ్మ, అటువంటి అమ్మను జాగ్రత్తగా చూసుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. మట్ట సుధీర్ మోహన్ మాట్లాడుతూ 1908లో అన్న జురీస్ ప్రారంభించిన మాతృవందన కార్యక్రమం కాలక్రమేనా మాతృ దినోత్సవంగా రూపొందిందని, అమ్మకు ప్రేమతో పుస్తకాన్ని రిలీజ్ చేసి మాతృమూర్తులకు ఆ పుస్తకాన్ని బహూకరించారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులు జూన్ 6వ తేదీ వరకు జరుగుతాయని, పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి కోరారు.

పెనుమంట్ర : పజిల్స్‌లో లాజిక్ వల్ల వాటిని పూర్తిచేసే వారికి తెలివితేటలు పెరుగుతాయని గ్రంథాలయం అధికారి పిటి శివకుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసని శిక్షణా శిబిరంలో భాగంగా 13వ రోజు స్థానిక టీచర్ చదువుల వెంకట నరేంద్ర పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్, పజిల్ గురించి చెప్పారు. పిల్లల చేత పజిల్స్ పూర్తి చేయించడం, పుస్తకాలు చదివించడం జరిగింది. ఈ వేసవి శిక్షణా శిబిరంలో ఎస్.నాగ చైతన్య, కె.తనిషా, కె.శ్రావ్య, కె.హసిని, బి.పూర్విక, పి.దక్షిత, కె.తరుణ్, బి.కార్తిక, వై.నిహాల్, కె.వాసుకి, కె.అనురామ్, ఎస్.తుషిత, కె.దీక్షిత ప్రసన్న లక్ష్మీ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని మానవత సంస్థ, గ్రంథాలయ సిబ్బంది కలిసి నిర్వహించారు.

పెనుమంట్ర : పజిల్ గురించి వివరిస్తున్న శివకుమార్

IN THE COURT OF THE 7 th ADDITIONAL DISTRICT JUDGE ELURU
A.S.NO.30/2024
Between:
Mulpuru Srikrishna Vasudeva Vara Prasada Rao. ....APPELLANT
Vs
Vegunta Dhanalakshmi & others ...RESPONDENTS
NOTICE
2. Vegunta Srinivassa Rao, Son of Late Vegunta Purnachandra Rao, Employee, D.N.1-26, H/o Appannaveedu Village. Appannaveedu Grampanchayat, Pedapadu Mandal.
3. Vegunta Niranjana Rao Son of Late Vegunta Purnachandra Rao, Employee, D.N.1-26, H/o Appannaveedu Village. Appannaveedu Grampanchayat, Pedapadu Mandal.
Whereas the Appellant filed appeal against the order and Decree dated 28-02-2022 passed in I.P.No.13/2015 on the file of Additional Senior civil Judge, Eluru. The Honourable court order notice in the above Appeal to the Respondents 2 to 4.
Whereas as the notice addressed to the Respondents 2 to 4 in the above Appeal could not be served as last known address and the notice could not be served;
Whereas the Honorable court ordered notice to the Respondents 2 to 4 by substituted service by way of publication;
You, are hereby called upon to appear in person or through Advocate before this Honourable court Eluru **on 23..06..2025 at 10.30 A.M.** and state your objections if any. Lest the petition will be decided ex-parte.
(As per court orders)
DEVULAPALLI SREE RAM
DEVULAPALLI KRISHNA SASTRY
Eluru, Advocates,
Dt.: 11..05..2025. Eluru

IN THE COURT OF 7th ADDITIONAL DISTRICT JUDGE, ELURU
E.P.NO.17/2024, O.S.NO.59/2016
Between:
Bala Veera Venkata Satyanarayana ...Decree-Holder
And
Jupalli Seetharama Rao & Co And others ...Judgement-Debtors
NOTICE
JDR.No.7: Smt. Jupalli Venkata Swathi, Priyadarshini, D/o Late Seetharama Rao, Business, D.No.45-B, Allasani Peddanna Veedhi, Ashok Nagar, Eluru, EJCJ.
JDR.No.8 : Jupalli Satya Rajiv, S/o late Seetharama Rao, Business, D.No.45-B, Allasani Peddanna Veedhi, Ashok Nagar, Eluru. EJCJ.
Whereas the Decree-Holder filed E.P. for sale of E.P. Schedule property for recovery of the Decree debt against Judgement-debtors. The Honourable court order notice to Judgement-debtor under order 21 Rule 22 C.P.C. in the above Execution petition. Whereas as the notice addressed to the Judgement-debtor in the above Execution petition could not be served as last known address and the notice could not be served; Whereas the Honorable court ordered notice to Judgement-debtor by substituted service by way of publication;
You, are hereby called upon to appear in person before this Honourable court Eluru on 18.06.2025 at 10.30 A.M and state your objections if any. Lest the Execution petition will be decided ex-parte.
(As per court orders)
DEVULAPALLI SREE RAM
Eluru **DEVULAPALLI KRISHNA SASTRY**
Dt.12.05.2025. Eluru, Advocates